నిబంధనలకు పాతర..!


పగిలిన కారు అద్దం

కౌటాలకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు బొమ్మకంటి మనీష్ ఇటీవల కుటుంబసభ్యులతో కలిసి కారులో కాగజ్‌నగర్‌కు వెళ్తాన్నారు. ఈ క్రమంలో ముత్తంపేట సమీపంలో రోడ్డుపై కంకర పడి ఉండడంతో కంకర రాళ్లపై నుంచి బైక్ వెళ్లడంతో కంకర రాయి బలంగా వచ్చి కారు అద్దానికి తాకడంతో పగిలింది. రూ. 15 వేలు పెట్టి కొత్త అద్దం పెట్టించామని, రహదారిపైనే కంకర కుప్పలుగా పడి ఉంటున్నాయని అన్నారు.

- ప్రాణాలు తీస్తున్న ఓవర్ లోడింగ్
- ఇసుక ట్రాక్టర్లు, కంకర ట్రిప్పర్లతో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ఓవర్‌లోడ్‌తో టిప్పర్‌లో కంకర తరలింపు


అదుపు తప్పి బోల్తా పడిన ట్రాక్టర్ (ఫైల్)

కౌటాల: జిల్లాలో వాహనాలు అతివేగం, అధిక లోడుతో ఇష్టారాజ్యంగా దూసుకుపోవడంతో అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. కంకర క్వారీ యజమానులు పొరుగు రాష్ట్రాలకు కంకరను తరలించే క్రమంలో గ్రామీణ ప్రజలు టిప్పర్ల చక్రాల కింద నలిగిపోతున్నారు. విద్యుత్ కాంట్రాక్టర్లు సైతం సంపదనే లక్ష్యంగా ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వాహనాల్లో అధిక లోడుతో విద్యుత్ స్తంభాలను, ఇతర సామగ్రిని తరలిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కౌటాల మండలం ముత్తంపేట శివారులోని కంకర క్రషర్ కంపెనీలు రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో టిప్పర్లలో కంకర తరలిస్తున్నారు. అలాగే వాగులు, నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

అతివేగం.. అధిక లోడ్

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో నిత్యం ఓవర్ లోడ్‌తో భారీ వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా.. 25 నుంచి 26 టన్నులు, 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా.. సుమారు 32 టన్నులకు పైగానే ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయి. ట్రాక్టర్‌లో కేవలం 10 టన్నులను మాత్రమే తరలించాల్సి ఉండగా 15 నుంచి 17 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు అదుపు తప్పి బోల్తా పడటమో, ఇతర వాహనాలను ఢీకొట్టడమో జరుగుతుంది. వాహనాల యజమానుల అత్యాశ, రవాణా శాఖ, మైనింగ్, ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యంతో నిరుపేద కూలీలు, ప్రజలు పోతున్నాయి.

ప్రమాదాలు.. గాలిలో ప్రాణాలు..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో కంకర ట్రిపర్లు అధిక లోడుతో వేగంగా వెళ్తున్నాయి. అయినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కౌటాల మండలంలో ముత్తంపేట నుంచి పార్డీ గ్రామానికి వెళ్లే మార్గంలో నాలుగు కంకర క్వారీలు, క్రషర్లు ఉండడంతో నిత్యం వందలాది భారీ వాహనాలు కంకర లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కాగజ్‌నగర్, కౌటాల, తలోడి, సిర్పూర్(టి), ముత్తంపేట, పార్డీ గ్రామాల వద్ద ప్రధాన రహదారి అనేక చోట్ల గుంతలమయంగా మారడంతో మరమ్మతులు చేస్తున్న ఫలితం లేకుండా పోతుంది. ఓవర్ లోడ్ కారణంగా కొత్తగా వేసిన రోడ్లు సైతం పగుళ్లు తెలుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

జిల్లాలో ఉన్న క్వారీల నుంచి ఏటా గనుల శాఖకు రూ. కోట్ల ఆదాయం వస్తుంది. వాస్తవంగా ఈ నిధులు క్వారీలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. కానీ జిల్లాలో నయా పైసా అందుకు వినియోగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల రాకపోకలపై, ఓవర్‌లోడింగ్ పై పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ, మైనింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారు. ప్రమాదాలు జరిగాక, బాధితులు ప్రాణాలు కోల్పోయాక నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రారంభమైన వరినాట్లు


లగ్గాం శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు

దహెగాం: వానాకాలం పంట వరికోతలు పూర్తవడంతో మళ్లీ వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. బోర్లు, బావులు ఉన్న రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకోగా కొందరు వరినాట్లు వేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు, లగ్గాం గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. వానాకాలం సాగు కలిసి రాలేదని యాసంగిలోనైనా కాలం కలిసి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు రైతులు.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో బుధవారం సీహెచ్‌పీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి. శ్రావణ్‌కుమార్, అధ్యక్షుడిగా గోలెం గట్టయ్య, ఉపాధ్యక్షుడిగా మేకల తిరుపతి, సీహెచ్ శ్యాంబాబు, సలహాదారులుగా సంపత్, బి. సంతోష్, జి. ఈశ్వర్, రామయ్య, ప్రధాన కార్యదర్శిగా మేరుగు రమేశ్, కోశాధికారిగా విద్యాసాగర్‌లను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూర్: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి శివరాం హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం ఆస్పత్రికి చేరుకొని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

21న వెల్‌బేబీ షో

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీలో వెల్‌బేబీ షో నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన నాలుగేళ్ల లోపు చిన్నారులు మాత్రమే వెల్‌బేబీ షోలో పాల్గొనేందుకు అర్హులన్నారు. షోలో పాల్గొనే వారు ఉద్యోగి గుర్తింపు కార్డు, ఉద్యోగి ఆసుపత్రి బుక్కు, చిన్నారులకు సంబంధించిన డేట్ ఆఫ్ బర్త్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

'కేంద్ర హోంశాఖ మంత్రి క్షమాపణ చెప్పాలి'

ఇంద్రవెల్లి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని బాబాసాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామ్‌రాజ్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బుధవారం దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మసుద్, భవలే సత్యానంద్, షేక్ సుఫీయన్, మీర్జా జీలానిబేగ్, పరత్‌వాగ్ దత్త, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

'విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి'


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్రం అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. విద్యాశాఖ మంత్రిని ఇప్పటి వరకు నియమించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖకు మంత్రిని నియమించి, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, కోరింగ రవీందర్, శంభు, మడావి రవి, ఆత్రం జ్యోతిరామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెంచికల్‌పేట: మండలంలోని ఎంపీయూపీఎస్ బొంబాయిగూడ పాఠశాలకు విద్యార్థులు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారుల విధులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను వివరించారు. వారి వెంట ఉపాధ్యాయుడు జాఫర్ ఉన్నారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అంజన్న


సాయికిరణ్

పెంచికల్‌పేట: సీఎం కప్ పోటీల్లో మండలంలోని చేద్వాయి, పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో సొద్గరి అంజన్న మొదటి స్థానంలో నిలువగా, 100 మీటర్ల పరుగు పందెంలో పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయికిరణ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలను హెచ్ఎం యాదగిరి, పీడీ నాగరాణి అభినందించారు.

'కార్మికుల జీవితాలతో చెలగాటం'


మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత 10 సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం (టీబీజీకేఎస్) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్ లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెరుగుదలపై ఈనెల 23న స్పష్టమైన ప్రకటన చేయకుంటే 27న జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌లు సాధించామని సంబురాలు జరుకునే యాజమాన్యం ఉత్పత్తికి కారకులైన కాంట్రాక్టు కార్మికులను మర్చిపోవడం సరికాదన్నారు. యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల జీతాల పెరుగుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 2022, సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాల ప్రకారం బెల్ట్ క్లీనింగ్, బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, నర్సరీ మహిళా కార్మికులకు సీఎం పీఎఫ్ వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, ఉపాధ్యక్షుడు విజయ్, సహాయ కార్యదర్శి వెంకటచారీ, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపాల్, రాజన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎంవీటీసీని తనిఖీ చేసిన బృందం


బహుమతులు అందజేస్తున్న కోటిరెడ్డి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి 1లో గల ఎంవీటీసీలో బుధవారం 55వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీటీసీని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ జీవీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ బృందం సందర్శించారు. వీటీసీలో ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతులకు హాజరైన ఒప్పంద, సింగరేణి ఉద్యోగులను రక్షణ చర్యలపై ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా సరియైన సమాధానం చెప్పిన ఉద్యోగులకు బహుమతులు అందచేశారు. ఇంటి నుంచి రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఎంవీటీసీ డీవీజీఎం వీఎస్ ఇందా, డీవైఎస్ఈ రమేశ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కౌటాల ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. బుధవారం కౌటాల కేజీబీవీ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో పకడ్బందీగా కొత్త మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెనూ చార్జీలను పెంచిందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉపాధ్యాయులున్నారు.

శుద్ధజలం అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న గోలేటి గ్రామస్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా పరిధిలోని గోలేటి విలేజ్‌లో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసిన శుద్ధజలయం అందించాలని గోలేటి గ్రామస్తులు కోరారు. బుధవారం ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ శ్రేయస్సు కోసం 40 ఏళ్ల క్రితం విలువైన భూములను సింగరేణికి అప్పగించటం జరిగిందన్నారు. గ్రామంలో సుమారు 350 కుటుంబాలు నివాసిస్తుండగా.. వారిలో 70 శాతం సింగరేణి కార్మిక కుటుంబాలే ఉంటున్నాయన్నారు. సంస్థ కోసం విలువైన భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన గోలేటికి సింగరేణికి సంస్థ నుంచి చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్, రవినాయక్, మోహన్, తిరుపతి, దిలీప్ పాల్గొన్నారు.

సమస్యల్లో కేజీబీవీ..!

- చల్లటి నీటితోనే స్నానం
- ప్రహరీ లేక ఇక్కట్లు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


లింగాపూర్ కేజీబీవీ భవనం

లింగాపూర్: మండలంలోని కస్తూరిబా విద్యాలయం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. దీంతో పాఠశాలలో చదువుకునే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, సిబ్బంది కొరత, విద్యార్థినుల చల్లనీటితోనే స్నానం వంటి సమస్యలు విద్యార్థినులను వేధిస్తున్నాయి.

ప్రహరీ లేక పరేషాన్..

మండల కేంద్రం నుంచి పిట్టగూడ వెళ్లే మార్గంలో 2022లో కేజీబీవీ నిర్మాణం ప్రారంభించారు. రూ. 3.35 కోట్లతో పనులు చేపట్టగా నిర్మాణం పూర్తి చేసి గత జూన్‌లో మంత్రి సీతక్క చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు. భవనం ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రహరీ మాత్రం నిర్మించలేదు. దీంతో పాఠశాల ఆవరణలో మూగ జీవాలు, పాములు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.

ఖాళీగా పోస్టులు..

కేజీబీవీలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పాఠశాలలో పీఈటీతో పాటు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, హిందీ బోధించే వారు లేక ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తూ.. విద్యార్థులకు బోధించడం, ఇబ్బందిగా మారాయి. పదో తరగతి విద్యార్థులకు సమయం చాలా దగ్గరగా ఉండడంతో ఉపాధ్యాయులు ఇంకా రాక పోవడంతో ఇబ్బందిగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అధికారులు దృష్టికి తీసుకెళ్తాం

విద్యార్థులకు సోలార్ ప్యానెల్స్ కొన్ని రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సిలబస్‌ను పూర్తి చేస్తాం. త్వరలోనే కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం.

– ప్రసన్న భారతి, ఇన్‌చార్జి ఎస్‌వో

సమస్యల పరిష్కారానికి కృషి

నేరేడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని రాజులతండా గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆహ్వాన పత్రిక అందించేందుకు వచ్చిన గ్రామస్తులు ఆలయం వద్ద చీకటి ఉందని తెలపడంతో స్పందించిన ఆయన వారం రోజుల్లోగా హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసి ప్రారంభించా రు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కపిల్ దేవ్, మౌలానా, కర్తార్, అశోక్, సంతోష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన పత్తి పరిశీలన

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన బండారి కమలాకర్ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల పత్తి ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా బుధవారం తహసీల్దార్ సుభాష్ చందర్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ కాలిపోయిన పత్తిని పరిశీలించారు. తహసీల్దార్ సిబ్బంది, ఏఈవో రాము పంచనామా నిర్వహించారు. నష్టాన్ని అంచనా వేశారు.

కొనసాగుతున్న 'సమగ్ర' ఉద్యోగుల సమ్మె


సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, జీవిత బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం, పదవి విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. గత 20 సంవత్సరాలుగా తక్కువ వేతనంతో శ్రమ దోపిడీకి గురి అవుతున్నామని వాపోయారు. మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, విశ్రాంతి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపారు. సిబ్బంది తుకారాం, మోహన్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఓ విద్యార్థి తల్లిదండ్రులు బుధవారం ఆందోళనకు దిగారు. పాఠశాలలో సోమవారం పీఈటీ విద్యార్థులను కబడ్డీ ఆడిస్తున్న క్రమంలో పదో తరగతి విద్యార్థి అఖిల్‌కు ప్రమాదవశాత్తు ముక్కుకు దెబ్బతాకి రక్తస్రావమైంది. దీంతో అతడి తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. ముక్కుకు సర్జరీ చేయాల్సి ఉంటుందని రూ.60వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో నిరుపేదలైన అఖిల్ తల్లిదండ్రులు సంతోష్, శారద పాఠశాలకు వచ్చి వైద్యఖర్చులు భరించాలని కోరారు. తాము భరించలేమని ఉపాధ్యాయులు తెలుపగా వారు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగి ఉపాధ్యాయులను నిలదీశారు. వైద్యఖర్చులు భరిస్తామని హామీ ఇవ్వగా ఆందోళనన విరమించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు


మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

వాంకిడి: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అర్జుగూడ పాఠశాల హెచ్ఎం ధర్మబాయి, బెండార హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జగదీష్, సంతోష్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.